

నేడు యథావిధిగా
‘ప్రజాసమస్యల పరిష్కార వేదిక’

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

ధరలు లేక అరటి రైతులు విలవిల

వనిపెంట వద్ద సాగులో ఉన్న అరటి

- పూర్తిగా పతనమైన ధరలు
- టన్ను రూ.6 వేలలోపే
- ఆందోళనలో రైతన్నలు

ప్రజాశక్తి - చాపాడు

మన ప్రాంత అరటి గతంలో అంతర్జాతీయ మార్కెట్‌లోనూ సత్తా చాటేది. ఎగుమతులు లేకపోవడం, సాగు పెరగడంతో ధరలు పడిపోయాయి. దీంతో అరటి సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఎగుమతులను ప్రోత్సహించడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని తెలుస్తుంది. బహిరంగ మార్కెట్లో వ్యాపారులు మాత్రం డజను రూ. 40 నుంచి 50 వరకు అమ్మకాలు చేపడుతున్నారు. రైతుల వద్ద డజను రూ.5కు కూడా కొనుగోలు చేయడం లేదు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ కొనుగోలుదారులు, అమ్మకం దారులతో ఒక వేదికను ఏర్పాటు చేసింది. 2023లో రికార్డు స్థాయిలో 35 వేల టన్నుల అరటి పండ్లను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నిర్ణయంతో అరటి సాగు మరింత పెరిగింది. రాష్ట్రంలో 63.84 లక్షల టన్నుల అరటి పండ్లు ఉత్పత్తి అవుతుండగా ఇందులో ఒక్క వైఎస్ఆర్ కడప జిల్లా నుంచే 23,15,300 టన్నుల దిగుబడి వస్తోంది. పులివెందులలో 20 వేల ఎకరాలు , మైదుకూరులో 13వేల ఎకరాలలో అరటి సాగు అయినది. ఇక్కడి పంటకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు కూడా లభించింది. సాధారణంగా అరటి పండ్లు 6, 7 రోజులు మాత్రమే నిల్వ ఉంటాయి. మన జిల్లాలో సాగు అయ్యే పండ్లు 14 రోజుల వరకు నిల్వ ఉంటున్నాయని రైతులు, వ్యాపారులు పేర్కొంటున్నారు. టిష్యూకల్చర్ వచ్చాక పండ్లలో నాణ్యత పెరిగిందని సూచిస్తున్నారు. కడప జిల్లాలో సాగైయ్యే అరటిలో 80 శాతం చెన్నై, బెంగళూరు నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. రాష్ట్రంలో 1,12,995 హెక్టార్లలో అరటి సాగవుతోంది. ఏటా 63,84,730 టన్నుల అరటి పండ్లు ఉత్పత్తి అవుతున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో అరటి సాగవుతుండగా విస్తీర్ణం, ఉత్పత్తిలో కడప ప్రథమ స్థానంలో ఉంది. కడప జిల్లాలో పులివెందుల, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గంలో అధికంగా అరటి సాగు అవుతుంది. మధ్య ప్రాచ్య దేశాలైన యుఎఇ, బెహ్రయిన్, ఈజిప్ట్, సౌదీ అరేబియా, ఖతార్, ఇరాన్ దేశాల్లో మన అరటికి మంచి డిమాండ్ ఉండేది. గ్రీన్ కావెండిష్ ప్రీమియమ్ రకాలు ఆ దేశాలకు ఎగుమతి అవు తున్నాయి. 2016-17లో 246 టన్నుల అరటి పండ్లు ఎగుమతి కాగా, 2017-18లో 4,300 టన్నులు, 2018-19లో 18,500 మెట్రిక్ టన్నులకు ఎగుమతులు పెరిగాయి. 2024- 25 కు 30 వేల మెట్రిక్ టన్నులు ఎగుమతి అవుతున్నాయి. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 35 వేల మెట్రిక్ టన్నుల అరటి పండ్లను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సాగు విస్తీర్ణాన్ని పెంచడంతోపాటు మార్కెట్‌ను విస్తరించడంలో అధికారులు విఫలమయ్యారని తెలుస్తుంది.

ఇతర రాష్ట్రాలకూ ఆంధ్రా అరటి..

కోస్తా, రాయలసీమలో పండించే అరటి ఇతర రాష్ట్రాలకు సైతం వెళ్తుంది. ఢిల్లీ, రాజస్థాన్, ఒడిశా, బెంగాల్, బిహార్ రాష్ట్రాలకు ఆంధ్రాలో పండించే అరటిని తరలిస్తున్నారు. అక్కడి నుంచి ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తామని అరటి హోల్ సేల్ వ్యాపారులు సూచిస్తున్నారు. కడప జిల్లాలో సాగైయ్యే అరటి మంచి నాణ్యతతో ఉండటంతో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో దీనికి బాగా డిమాండ్ ఉంది. మార్కెట్ సీజన్ల వారీగా ఉంటుంది. జులై నుంచి నవంబర్ వరకూ రేటు బాగా పలుకుతుంది. వేసవిలో మార్కెట్ సాధారణంగా ఉంటుంది. విదేశాలకు ఎగుమతిని చేసే అరటికి సాగు దశలోనే జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకు తగినట్లుగా ఏపీ రైతులు వ్యవహరిస్తున్నారు. సౌదీ, దుబాయ్ వంటి దేశాలకు అరటి ఎగుమతులు మరింత పెరిగే అవకాశం ఉంటుదని వ్యాపారులు పేర్కొంటున్నారు.

సబ్సిడీలు దక్కడం లేదు..

అరటి సాగు చేసే వారిలో సాధారణ రైతాంగం ఎక్కువగా ఉంటున్నారు. అయితే ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలు, వివిధ పథకాలు, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాలకు, ఇతర ఎగుమతిదారులకు ఉపయోగపడుతున్నాయే తప్ప సామాన్య రైతులకు పెద్దగా ప్రయోజనం దక్కడం లేదని రైతులు పేర్కొంటున్నారు. పెట్టుబడి ఖర్చులు బాగా పెరిగినట్లు తెలి పారు. అరటి పంట వాతా వరణ మార్పుల మీద ఆధా రపడి ఉంటుందని, గాలుల తీవ్రత ఎక్కువైతే పంట మీద ఆశలు వదులుకోవాల్సిందే అంటు న్నారు. పంట కాపాడు కోవడానికి కట్టెల సాయం తో మొక్కను నిలబెట్టు కోవాల్సి వస్తుం దని, కానీ కష్టపడి పండిం చిన తర్వాత ధరలు గిట్టు బాటు కావడం లేదని ప్రభు త్వమే పంట కొనుగోలు చేసి ఎగుమతి చేస్తే ఉపయో గంగా ఉంటుందని, సబ్సి డీలు ఇచ్చి, పంటకి మార్కెట్ కల్పిస్తే అరటి ఢోకా ఉండదని అని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలు ఇలానే కొనసాగితే అరటి సాగు తగ్గుముఖం పడుతుందని వారు ఆందోళన చెందుతున్నారు.

ధరలు లేక నష్టాలు వస్తున్నాయి

రెండు ఎకరాలలో అరటి తోటను సాగు చేపట్టాను. ప్రారంభంలో టన్ను రూ. 14 వేల వరకు ధరలు పలికాయి. ప్రస్తుతం క్రమేపీ తగ్గుతూ టన్ను రూ. 6వేలకు మాత్రమే వ్యాపారులు అడుగుతున్నారు. సాగు ఖర్చులు గణనీయంగా పెరిగాయి. ఎకరాకు రూ. లక్ష వరకు ఖర్చులు అయ్యాయి. ప్రస్తుతం ఉన్న ధరలకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. ప్రభుత్వం అరటి రైతులను ఆదుకోవాలి.

వెంకటేశ్వర్లు, అరటి రైతు, వెంకటాపురం.

అరటి రైతులను ఆదుకోవాలి

ఈ ఏడాది రూ. లక్షలు ఖర్చుపెట్టి సాగుచేసిన అరటి పంటకు వల్ల నష్టాలు వస్తున్నాయి. మార్కెట్లో ధరలు లేకపోవడంతో సాగు ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. గతంలో టన్ను రూ. 20 వేల ఉన్న ధరలు ప్రస్తుతం రూ. 5వేలకు చేరుకున్నాయి. కాయలు బాగుంటేనే కొనుగోలు చేపడుతున్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి లేదంటే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

- తిరుమలయ్య, అరటి రైతు, లింగాలదిన్నె.

తక్కువ ధరలతో తరలిస్తున్న అరటి గెలలు

లేబర్ కోడ్‌లను తక్షణమే
ఉపసంహరించుకోవాలి

- సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కార్మిక చట్టాలు నిర్వీర్యమయ్యే లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక సంఘాలు సుదీర్ఘ పోరాటాల ద్వారా ఎంతగానో కష్టపడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలు నిర్వీర్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలు ఇప్పటివరకు కొంత మేరకు కార్మికుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ వచ్చాయని తెలిపారు. అనేక పరిమితులు ఉన్నప్పటికీ, వేతనాలు, పనిగంటలు, సామాజిక భద్రత, పారిశ్రామిక భద్రత, తనిఖీ, సమిష్టి బేరసారాలు వంటివి కొంతవరకు అమల్లో ఉండేవని పేర్కొన్నారు. చట్టాలను కార్మికులకు మరింత అనుకూలంగా మార్చడానికి బదులుగా, కార్మికుల హక్కులను నీరు గార్చే కొత్త లేబర్ కోడ్‌లు అమలు చేయడం దురదృష్టకరమన్నారు. కార్మికుల హక్కులు దీర్ఘకాలం నుంచి ఉన్నాయని, అవన్నీ వారు పోరాడి సాధించుకున్నవేనని పేర్కొన్నారు. కార్మిక చట్టాలను పూర్తిగా రద్దు చేయడం ద్వారా యజమానులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్మిక చట్టాల వల్ల ఉపాధి, పెట్టుబడులు పెరుగుతాయని ప్రభుత్వం చేస్తున్న వాదన పూర్తిగా నిరాధారమన్నారు. పెట్టుబడి దారులను రక్షించడం కోసం కార్మికులకు భద్రత లేకుండా వుండేలా ఈ కోడ్‌లు రూపొందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా కోడ్‌లు ఉన్నాయని, పైగా కార్మిక వర్గం సమ్మె చేసే హక్కును లేకుండా చేయాలన్నారు. కార్మికులు చేసే ఏ కార్యక్రమం అయినా నేరపూరితం చేయాలని ఆ కోడ్‌లు చెబుతున్నాయని వివరించారు. పాలకులు కార్మికుల హక్కులను కాల రాసేందుకు, కార్పొరేట్ వర్గానికి ఏకపక్షంగా సానుకూలమైన రాజ్యాన్ని సృష్టించాలని ఈ లేబర్ కోడ్‌లు పేర్కొంటున్నాయని తెలిపారు. కార్మికులతో చర్చలు, సంప్రదింపులు జరపకుండా కోడ్‌లను అమలు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య, రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించడాన్ని ఖండించారు. ఈ లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించాలని, కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ప్రతిఘటించేందుకు, మరింత సమగ్రమైన రీతిలో కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు ఐక్య పోరాటాలను నిర్మించడంలో భాగస్వామ్యం కావాలని అన్ని కార్మిక సంఘాలు, ప్రజాస్వామ్య శక్తులకు పిలుపునిచ్చారు.

టిడిపి, వైసిపి పరస్పర దాడులు

- ఇరు గ్రూపులను చెదరగొట్టిన పోలీసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మెడికల్ కాలేజీ వద్ద ఆదివారం ఉద్రిక్తత నెలకొంది. రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అనుచరులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. మదనపల్లె మెడికల్ కాలేజీ నిర్మాణ విషయంలో శ్రీరామ్ చిన్నబాబు పెద్దిరెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని అవాకులు, చవాకులు పేలుతున్నారని, ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించమంటూ వైసిపి నేతలు హెచ్చరించారు. ఆదివారం మెడికల్ కాలేజ్ ని సందర్శిస్తున్నామని, ఏవైనా ఆధారాలుంటే అక్కడికి నిరూపించాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి అనుచరులు ఆదివారం మెడికల్ కాలేజీ వద్దకు చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న శ్రీరామ్‌చినబాబు అనుచరులు అధిక సంఖ్యలో అక్కడ చేరుకొనడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసుల ఎదుటే ఇరువర్గాల వారు పరస్పరం దాడులకు దిగారు. అప్రమత్తమైన పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ విషయమై తాలూకా సిఐ కళా వెంకటరమణను వివరణ కోరగా ఇరు గ్రూపుల వారు మెడికల్ కాలేజ్ కు వెళ్ళడంతో కొంత వాదోపవాదాలు, తోపులాటలు జరిగాయన్నారు. ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేయడంతో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చామని తెలిపారు. మెడికల్ కాలేజ్ నుంచి ఇరువర్గాలను పంపివేయడంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చుమన్నారు. ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో ఎలాంటి కేసులు నమోదు చేయలేదన్నారు.

పరస్పర దాడులు చేసుకుంటున్న టిడిపి, వైసిపి గ్రూపు వ్యక్తులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి-రాయచోటి : పట్టణంలోని డైట్ హైస్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీలకు హాజరైన 250 మంది విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. లయన్ మిక్కిలినేని ప్రసాద్‌నాయుడు ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధ్యక్షులు లయన్ పసుపులేటి శ్యామ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జరిగిన చెకుముకి సైన్స్ పోటీలకు హాజరైన విద్యార్థులందరికీ నా వంతుగా అన్నదాన కార్యక్రమం చేసినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి తన వంతు సహాయ సహకా రాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ పి.ఎస్.హరినాథ్‌రెడ్డి, రీజనల్ చైర్మన్ లయన్ షేక్.మహమ్మద్, ఉపాధ్యక్షుడు లయన్ వి.హరీష్ చంద్,కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్, లయన్ వి.నారాయణ రెడ్డి,లయన్ గౌతమ్, లయన్ ప్రకాష్ రెడ్డి, విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

పోస్టర్ల ఆవిష్కరణలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జాబీర్

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను యూనియన్ నేతలతో కలిసి విడుదల చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందన్నారు. డిసెంబర్ 12,13,14 తేదీలలో తిరుపతి నగరంలో జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలకు విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహ, డివి.రమణ మాట్లాడుతూ మహాసభలలో విద్యా రంగ సమస్యలపై, అభివృద్ధిపై అనేక తీర్మానాలు చేస్తారన్నారు. ఎన్నికల ముందు జిఒ నంబర్ 117 రద్దు చేసి పాఠశాలల మూసివేతను ఆపివేస్తామని హామీ ఇచ్చి తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మహాసభలకు విద్యార్థులు మేధావులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్మోహన్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి ఆఫ్రిది ప్రదీప్ పాల్గొన్నారు.

సంఘటిత పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

- దూదేకుల సంఘం రాయలసీమ నాయకులు పి.సిద్ధయ్య, ఖాదర్‌బాషా

ప్రజాశక్తి - రాయచోటి

సంఘటిత పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని దూదేకుల సంఘం రాయలసీమ నాయకులు పగడాల సిద్దయ్య, ఖాదర్‌బాషా హిదాందల్లా పేర్కొన్నారు ఆదివారం రాయచోటి పట్టణం మాసాపేటలోని దూదేకుల సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూదేకులు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా రాణించడానికి కృషి చేయాలన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయాల్లో పాలక ప్రతిపక్షాలు దూదేకులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు ఇటువంటి మోసపూరిత వైఖరులను ఎదుర్కోవడానికి గ్రామాలు, మండలాల నుంచి జిల్లా కేంద్రాల వరకు కమిటీలను ఏర్పాటు చేసుకొని కార్యక్రమాలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే విద్య ఉద్యోగ , రాజకీయ అవకాశాలలో హక్కులు దక్కను పడతాయని చెప్పారు. దూదేకుల సంఘం రాష్ట్ర నాయకులు ఖాదర్‌బాషా మాట్లాడుతూ ఎంతో సుదీర్ఘ సుదీర్ఘ పోరాటాలతోనే ఫెడరేషన్ కార్పొరేషన్ వంటి సంస్థల ఏర్పాటు సాధ్యమైందన్నారు. ఇదే తరహాలో రాజకీయ రంగంలో కూడా అలుపెరగని పోరాటం చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కో-ఆప్షన్ వంటి పదవులకు దూదేకులను ఎంపిక చేయాల్సిన అనివార్యతను సృష్టించాలన్నారు. పిల్లల భవిష్యత్తు అవకాశాలను దృష్టిలో ఉంచుకొని పనిచేయాలని పేర్కొన్నారు. దూదేకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మన్నూరు అక్బర్ మాట్లాడుతూ డిసెంబర్ 1న రక్తదానం శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, దూదేకుల సంఘీయులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదాన ఆవశ్యకత పెరిగిన నేపథ్యంలో సమాజానికి దూదేకుల రక్తాన్ని ఉంచాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం నాయకులు ఆయిల్ మిల్ ఓబులేసు, రిటైర్డ్ ప్రిన్సిపల్ మస్తాన్, గగుటూరు నజీర్, మహబూబ్ బాషా, బాదుల్లాతో పాటు రాయలసీమ జిల్లాలకు చెందిన దూదేకుల సంఘం నాయకులు హాజరయ్యారు.

శ్రీశైలం దేవస్థానం చైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి-రాజంపేట : శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడును నందలూరు మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబుసూర్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆదివారం రాజంపేట మండలం వైబిఎన్ పల్లెలోని పోతుగుంటను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ శ్రీశైలం దేవస్థానానికి సరైన వ్యక్తికి చైర్మన్ పదవి లభించిందని, తద్వారా ఆలయం అన్ని విధాల అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో అందరి సహకారంతో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

పరిశ్రమలతోనే యువతకు ఉపాధి

జిల్లా పరిశ్రమల శాఖ అధికారి కృష్ణ కిషోర్

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

పరిశ్రమల ద్వారానే యువతకు ఉపాధి అవకాశాలు లబిస్తాయని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి కృష్ణ కిషోర్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో పరిశ్రమల శాఖ అధికారుల పని వివరాలు, పరిశ్రమలు, సిబ్బంది వివరాలు, పరిశ్రమల ద్వారా యువత ఉపాధి ఎలా పొందాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

పరిశ్రమల కార్యాలయం పని వివరాలు తెలపండి?

కొత్తగా పరిశ్రమ ప్రారంబించాలనుకునే వారికి సలహాలు సూచనలు ఇవ్వడం, పరిశ్రమలకు అవసరమైన లైసెన్సులు, అనుమతులు పొందడంలో సలహాలు ఇవ్వడం. చిన్న, సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమలకు ఎంఎ స్ఎంఇ నమోదు చేయడం. ఆ పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందేలా సాయం చేయడం, ఎపిఐడిపి 2024-29, ఎపిఎంఇడిపి 2024-29, పిఎంఇజిపి వంటి యోజ నల కింద లబ్ధిని పొందటానికి సలహాలు సూచనలు చేస్తాం. పరిశ్రమలకు అవసమైన సబ్సిడీలు, ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలను అమలు చేస్తాం. పరిశ్రమలకు అవసరమైన అనుమతులు, క్లియరెన్సులు పొందడంలో ఇతర విభాగాలతో సమన్వయం. జిల్లా పరిశ్రమల కమిటీలు, సమావేశాలు నిర్వహించడం ద్వారా పరి శ్రమల స్థాపించుటకు ఉన్న అడ్డంకులను తొలగించడం వంటి పనుల నిర్వహిస్తాం.

జిల్లాలో పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి? వాటి ద్వారా ఎంత మంది ఉపాధి పొందుతున్నారు?

అన్నమయ్య జిల్లాలో రూ.3475 కోట్ల పెట్టుబడితో 7 పెద్ద పరి శ్రమలు స్థాపించి 152 మందికి ఉపాధి కల్పిస్తున్నాం. ఎంఎస్ఎంఇలలో రూ.842.17 కోట్ల పెట్టుబడితో 34,621 యూనిట్లు ఏర్పాటు చేసి 114247 మందికి ఉపాధి కల్పిస్తున్నాం.

ఇండస్ట్రీయల్ పార్కులు ఎన్ని మంజూరయ్యాయి?

జిల్లాలో ప్రస్తుతం 149 8.86 ఎకరాల విస్తీర్ణంలో 19 పారిశ్రామిక పార్కులున్నాయి. 341.68 ఎకరాల విస్తీర్ణంలో 6 ప్రతిపాదిత కొత్త ఎంఎస్ ఎంఇ పార్కులు ఉన్నాయి.

ప్రతి పాదిత పరిశ్రమలకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

సింగల్ విండో ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నూతనంగా స్థాపించదలచిన ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు పారిశ్రామిక పార్కుల కోసం స్థలాల కేటాయింపు, కలస్టర్స్ ఏర్పాటు, పరిశ్రమలకు అవసరమైన లైసెన్సులు, అనుమతులు పొందడంలో సలహాలు ఇస్తాం..ఉద్యమం రిజిస్ట్రేషన్ ప్రయోజనాలు, ఎపి ఐడిపి 2024-29, ఎపి ఎంఇడిపి పాలసీస్ పథకాల ద్వారా లబ్దిని పొందటానికి సలహాలు, సూచనలు ఇస్తున్నాం.

జిల్లాకు కొత్త పరిశ్రమలు ఏమైనా వస్తున్నాయా?

జిల్లాలో దుస్తుల తయారీ, ఆహారం, వ్యవసాయం, మిల్లెట్ ప్రాసెసింగ్, గ్రానైట్ కటింగ్, పాలిషింగ్, సిమెంట్ బ్రిక్స్, ఆటోమొబైల్ సర్వీసింగ్ మొదలైన వివిధ రంగాలలో కొన్ని కొత్త పరిశ్రమలు అమలులో ఉన్నాయి.

ప్రధానమంత్రి ఉపాధి కల్పన వివరాలు తెలపండి?

ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పిఎంఇజి పి) అనేది గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలను సృష్టించడానికి భారత ప్రభుత్వం ప్రారంభించిన ఒక ప్రధాన పథకం. ఇది ముఖ్యంగా సూక్ష్మ తరహా సంస్థలు (మైక్రో) రంగానికి చెందిన వారికి కొత్త వెంచర్లు, సంస్థలను స్థాపించడానికి ఆర్థిక సహాయం అందిస్తుంది. తద్వారా స్వయం ఉపాధి, వ్యవస్థాపకతను సృష్టిస్తుంది. ఈ పథకం అట్టడుగు స్థాయిలో వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, ముఖ్యంగా యువత, మహిళలు, సమాజంలోని అణగారిన వర్గాలకు ఉద్యోగ అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రజలు తమ సొంత చిన్న పరిశ్రమలు, సర్వీసింగ్ యూనిట్లు స్థాపించుకునేలా ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చు. ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలలో నిరుద్యోగాన్ని తగ్గిస్తున్నాం.తయారీ, సేవలు వంటి వివిధ రంగాలలో సూక్ష్మ సంస్థల స్థాపనను ప్రోత్సహిస్తున్నాం.

సబ్సిడీ వివరాలు తెలియజేయండి?

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి విధానం-2024-29 అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడంపై దృష్టి సారించే సమగ్ర విధానం. ఈ విధానం పెట్టుబడులను ఆకర్షించడం, ఉద్యోగ సృష్టిని ప్రోత్సహించడం, ఆర్థిక వృద్ధిని పెంచడం, స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ విధానం కింద అందించే సబ్సిడీలు, ప్రోత్సాహకాలు తయారీ, సేవలు, మౌలిక సదుపాయాలు, సాంకేతికత వంటి వివిధ రంగాలలో పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నాం.తయారీ, సేవలు వంటి వివిధ రంగాలలో సూక్ష్మ సంస్థల స్థాపనను ప్రోత్సహిస్తున్నాం.

పరిశ్రమల శాఖను సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

ఈ జిల్లా పరిశ్రమల కేంద్రానికి కేటాయించిన 14 మంది సిబ్బందికిగాను ఏడుగురు మాత్రమే ఉన్నారు. ఉన్న సిబ్బందితోనే విధులు నిర్వహించుకుంటున్నాం.

ప్రజలకు సలహాలు, సూచనలు ఏమని ఇవ్వాలి అనుకుంటున్నారు?

పరిశ్రమను ప్రారంభించడానికి ప్రణాళిక, ఓర్పు, పట్టుదల అవసరం. ప్రజలు కచ్చితమైన అవగాహన లేకుండా తొందరపడినప్పుడు విఫలమవుతారు. కానీ వారు కొన్ని విషయాలపై దృష్టి సారించాలి. ముఖ్యంగా మార్కెట్‌ను అధ్యయనం చేయడం, ప్రభుత్వ మద్దతును ఉపయోగించడం, డబ్బును తెలివిగా వినియోగించడం, అవసరం మేరకే రుణాలు పొందడం, రుణాలను క్రమబద్ధంగా చెల్లించడం, చట్టపరమైన నియమాలను పాటించడం, నాణ్యతపై దృష్టి పెట్టడం, బలమైన వర్కింగ్ టీమ్ ఏర్పాటు కావాలి.

ముస్లింల హక్కుల కోసం పోరాటం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముస్లిముల హక్కుల కోసం ఏకతాటిపైకి తేవడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జాఫర్‌పులి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో అన్నమయ్య, కడప జిల్లాల ముస్లిం ఐక్యవేదిక గౌరవ సలహాదారులు డాక్టర్ ఎస్.కే బాషా ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాఫర్ పులి హాజరై జిల్లాలో కమిటీలను ఏర్పాటు చేసి కొంతమందికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాదిగా ముస్లింలను ఓటు బ్యాంకుగానే వాడుకుని విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. ముస్లింలకు అభివృద్ధిలో వాటా లేదని, సంక్షేమంలో సమానత్వం ఉండదని ముస్లింలను పాతాళంలోకి నెట్టివేస్తున్నారని ఆరోపించారు. ముస్లింల ఐక్యవేదిక సంపూర్ణ హక్కుల సాధన కోసం, జాతిని మేల్కొల్పే విధంగా చైతన్య పరుస్తోంద న్నారు. ముస్లింల సంపూర్ణ సామాజికాభివృద్ధి సాధించే దిశగా ఐక్యవేదిక ప్రత్యేక ప్రణాళికలతో పనిచే స్తూ, జాతిని జాగృతం చేయడానికి ముందుకు సాగుతోందన్నారు. ముస్లింలకు రాజకీయ రిజర్వేషన్ల కోసం డిసెంబర్ 1న నంద్యాల నుంచి పాదయాత్రకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో మదనపల్లి ఐక్యవేదిక కమిటీ నాయకులు బావాజీ, సోహెల్, బావాజాన్, ఖాదర్ బాషా, ముబారక్ సాహెబ్, ముబారక్, సమీరుద్దీన్, పఠాన్ ముబారక్ ఖాన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్

‘మిట్స్’లో ఘనంగా ఎన్‌సిసి దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ యూనివర్సిటీలో ఆదివారం ఉదయం 77వ ఎన్‌సిసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్ పాల్గొని ఎన్‌సిసి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 1948లో స్థాపించబడిన ఎన్‌సిసి దేశంలోని క్రమశిక్షణ, దేశభక్తి మరియు కర్తవ్య భావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఐక్యత, క్రమశిక్షణతో అందరూ కట్టుబడి ఉండాలని, స్నేహభావంతో ముందుకు సాగాలన్నారు. ప్రతి క్యాడెట్ సేవా దృక్పథం కలిగి ఉండాలని దేశానికి సమస్య వచ్చినప్పుడు ఓ సైనికుడిలా పనిచేయాలన్నారు. కెప్టెన్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ మిట్స్ యూనివర్సిటీ 2024-2025 విద్యాసంవత్సరానికి గాను ఉత్తమ ఇన్స్టిట్యూట్‌గా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో గుర్తింపు వచ్చిందన్నారు. గుజరాత్‌లో జరుగుతున్న జాతీయస్థాయి రాక్ క్లైంబింగ్ క్యాంపులో యూనివర్సిటీ ఎన్‌సిసి విద్యార్థి రాణి స్తున్నాడని, ఢిల్లీలో జరిగిన తల్ సైనిక్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు వివిధ విభా గాలలో వెండి పతకాలు సాధించారని తెలిపారు. 2026వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఫరేడ్‌లో కూడా మిట్స్ యూనివర్సిటీ నుంచి ఒక విద్యార్థి పాల్గొన్నే అవకాశం ఉందని అయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్, ఎన్‌సిసి ఆఫీసర్, కెప్టెన్ నవీన్ కుమార్, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

వీరభద్రుడి సన్నిధిలో హరి జవహర్‌లాల్

ప్రజాశక్తి-రాయచోటి : పట్టణంలో వెలసిన శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామిని ఆదివారం రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ హరి జవహర్‌లాల్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా వారికి ఆలయ ఇఒ డి.వి.రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు వీరభద్రాలయంలోని వినాయకుడు, అఘోరలింగేశ్వరుడు, సుబ్రహ్మణ్యం స్వామి, భద్రకాళి అమ్మ వారు,వీరభద్రుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి ఆలయ విశిష్టతను తెలియజేసి దుశ్శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు.

మాట్లాడుతున్న మై ఫోర్స్ మహేష్

30న కృతజ్ఞత ర్యాలీ

ప్రజాశక్తి-మదనపల్లె

ఎపిఐఐసి డైరెక్టర్‌గా 26న విజయవాడలో ప్రమాణస్వీకారం చేయనున్న సందర్భంగా 30న పట్టణంలో జనసేన శ్రేణులతో కృతజ్ఞత ర్యాలీ నిర్వహించనున్నట్లు మైఫోర్స్ మహేష్ పేర్కొన్నారు. ఆదివారం జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంగా తన వెంట నడుస్తూ జనసేన సిద్ధాంతాల కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరి సహకారంతోనే తనకు ఈ బాధ్యత దక్కిందన్నారు. .జనసేన జిల్లా లీగల్ అధ్యక్షుడు అమర్ నారాయణ మాట్లాడుతూ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఎపిఐఐసి కార్యా లయందగ్గర నుంచి కృతజ్ఞత ర్యాలీ ప్రారంభమ వుతుందని తెలిపారు. అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన నేతలు, కార్యకర్తల ఆధ్వర్యంలో మహేష్‌కు అభినందన సభ కూడా నిర్వహి చనున్నట్లు వెల్లడించారు.అమర్ నారాయణతో పాటు రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిని, కుప్పం ఇన్‌చార్జ్ నరేష్, మైఫోర్స్ అధ్యక్షులు ఉమేష్, జనసేన నాయకులు హరినాథ్, జయ భవ్య కిషోర్, పటాన్ మహమ్మద్ అలీ, స్వేరో మహేష్, రెడ్డిరాణి రాయల్ కార్యక్రమ ఏర్పాట్లకు ఆహ్వాన కమిటీని ఏర్పాటు చేశారు. పట్టణ ప్రజలు అందరూ ఈ ర్యాలీకి హాజరై విజయ వంతం చేయాలని నేతలు కోరారు.

ఎస్‌సి వర్గీకరణతో మాలలకు అన్యాయం

ప్రజాశక్తి-సుండుపల్లి

ఎస్‌సి వర్గీకరణతో మాలలకు విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో అన్యాయం జరుగుతోందని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి కె.వి రమణయ్య పేర్కొన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని కూడా తుంగలో తొక్కేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో మాలలకు రావాల్సిన సబ్సిడీ రుణాలు కూడా ఇవ్వడం లేదన్నారు. ఎస్‌సి వర్గీకరణ విషయంలో చాలా అన్యాయం జరిగిందని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. రాజకీయ నేతలు అవలంబిస్తున్న కుటిల రాజకీయాలతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మాలల సంక్షేమానికి కృషి చేయాలని ఆయన కోరారు.

అనారోగ్యంతో హోంగార్డ్ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె తాలూకా పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోం గార్డు వెంకటరమణ ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని ఆస్పత్రిలో వైద్యం చేయించు కున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని తట్టివారిపల్లెలో కాపురం ఉంటున్న వెంకటరమణ మధ్యాహ్నం తనకు కడుపు నొప్పిగా ఉందని చెప్పడంతో వెంటనే కుటుంబంలో సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలోని మృతి చెందినట్లు తెలిపారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

- మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

12వ వేతన సవరణ అమలు ఆలస్యమవుతున్న కారణంగా 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హార్సిలీహిల్స్‌లో జరిగిన ఎస్‌టియు రామసముద్రం మండల కౌన్సిల్, మండల 30 వసంతాల మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 జులై నుంచి 12 పిఆర్‌సి అమలు కావలసి ఉండగా ఆలస్యమైనందు వలన ప్రస్తుత ప్రభుత్వం 12వ పిఆర్‌సి కమిటీ చైర్మన్ నియమించాలని,12 లక్షల మంది ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మిక,పెన్షనర్లు మధ్యంతర భృతి కోరుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు.ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించవలసిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 11వ పిఆర్‌సి బకాయిలను, డిఎ, సరెండర్ లీవ్ బకాయిలు విడుదల చేయాలన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అంకం శివారెడ్డి,పోకల మధుసూదన,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్,రాష్ట్ర ఉపాధ్యక్షులు కడియాల మురళి,కార్యదర్శి రాజారెడ్డి, మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అయూబ్, రమాదేవి పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్ నాగరాజుకు సన్మానం

ప్రజాశక్తి-వీరబల్లి

భూటాన్‌లో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కొర్లకుంట నాగరాజు బంగారు పతకం సాధించడంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విఆర్‌ఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడానికి తర్ఫీదు ఇచ్చిన కోచ్ కు, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తనని ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధిస్తానన్నారు. నాగరాజును సిరిగిరి కుళాయిరెడ్డి, విఆర్‌ఎస్ సురేంద్రారెడ్డి, రిటైర్డ్ ఉద్యోగులు తాళ్లపాక నటరాజ, శ్రీనివాసులు, బసిరెడ్డి, మల్లికార్జున, ఫైబర్ నెట్ మస్తాన్, మిత్రులు వినయ్ కుమార్, రాహుల్, రుక్సర్ తదితరులు అభినందించారు.ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ మైన్స్ అధికారి నటరాజ మాట్లాడుతు క్రీడల్లో సత్తా చాటితే ఏదైనా సాధించగలమని నిరూపించిన నాగరాజును ప్రతి క్రీడాకారుడు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో మండలంలోని క్రీడాకారులను ఆదుకోవడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని కోరారు. సురేంద్రారెడ్డి మాట్లాడుతు క్రీడాకారులను ఆర్థికంగా ప్రోత్సహించిడానికి ముందుకు వచ్చిన నటరాజకు, మిగతా అధికారులకు ధన్యవాదములు తెలుపుతున్నామని తెలిపారు.

'మిట్స్'లో వైర్‌లెస్ కనెక్టివిటీపై అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో డిసెంబర్ 8 నుంచి10 వరకు ' వైర్‌లెస్ కనెక్టివిటీలో పురోగతి టెక్నాలజీస్, సిస్టమ్స్ అండ్ నెట్‌వర్క్ ఎవల్యూషన్' అనే అంశంపై అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు విసి డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు.ఈ సదస్సు నిర్వహణకు ఐఇఇఇ కమ్యూనికేషన్ సొసైటీ స్టూడెంట్ చాప్టర్ నుంచి 5వేల అమెరికన్ డాలర్ల (రూ.4,48,120) నిధులు మంజూరైనట్లు తెలిపారు. వైర్లెస్ కమ్యూనికేషన్ రంగంలో తాజా మార్పులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నెట్‌వర్క్ సిస్టమ్‌ల పరిణామం వంటి కీలక అంశాలపై అంతర్జాతీయ స్థాయిలో ఐఇఇఇ మెంబర్‌షిప్ కలిగిన ఇంజినీరింగ్ విద్యార్థులతో చర్చలు, సెషన్లు నిర్వహించబడనున్నాయని విసి వివరించారు. ఈ సదస్సుకు కన్వీనర్లుగా డాక్టర్ రాజశేఖరన్, డాక్టర్ సి.కుమార్, కో-ఆర్డినేటర్లుగా డాక్టర్ అరవింద్ రాజ్, డాక్టర్ జి.నాగాశ్వేత, జి.సుబ్బారావు వ్యవహరించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఐఇఇఇ కమ్యూనికేషన్ సొసైటీ స్టూడెంట్ చాప్టర్‌కు యూనివర్సిటీ ఫౌండర్, ఛాన్సలర్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్‌చౌదరి, ప్రో ఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్, ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్, రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విజయభాస్కర్ చౌదరి

గిరిజన, ఆదివాసీలపై దాడులు దారుణం

ప్రజాశక్తి-పీలేరు

గిరిజన, ఆదివాసీల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును వ్యతిరేకిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కిల్లా విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం పీలేరు నియోజకవర్గ అధ్యక్షులు వెంకట గిరి రాజేష్ అధ్యక్షతన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ గిరిజ, ఆదివాసీల పట్ల వివక్ష తగదన్నారు. ఈ మధ్య కాలంలో కార్పొరేట్ శక్తుల లబ్ధి కొరకై అడవి సంపదైన కలప, ఖనిజాలు దోపిడీకి గురవుతున్న సందర్భాల్లో అటవీ సంపద, ఆటవికులైన ఆదివాసీ గిరిజనులకే చెందాలని రాజ్యాంగబద్ధ నియమాలను కూడా కాలరాస్తున్నారని పేర్కొన్నారు. ఆటవీ సంపద కోసం పోరాడుతూ, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కేంద్రాన్ని ప్రశ్నించిన గిరిజన, ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం కక్ష కట్టి వ్యవహరించడం సరైనది కాదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి గిరిజన, ఆదివాసీల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఆదివాసీ, గిరిజన బిడ్డల అభివృద్ధికి ఏం చేసిందో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అటవీ ప్రాంతాల్లో చేపట్టిన ఆపరేషన్ కగార్ కారణంగా ఆదివాసీ, గిరిజనులు బిక్కుబిక్కుమంటూ బతుకులు వెళ్ళదీయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ, గిరిజనులకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రత్యేక హక్కులు ఏమయ్యాయని వారు ప్రశ్నించారు. ఒకవైపు ఆదివాసీ, గిరిజనుల హక్కులను అణిచివేస్తామంటూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పదేపదే ప్రకటనలు చేస్తుండడం దురదృష్టకరమని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన తమ హక్కులను కాలరాస్తున్న కేంద్రానికి వ్యతిరేకంగా గొంతు విప్పుతున్న గిరిజన, ఆదివాసీల జీవితాలు ఛిద్రమవుతున్నాయని చెప్పారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం తన పద్ధతిని మార్చుకుని గిరిజన, ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం తోడ్పడాలని కోరారు. లేనిపక్షంలో తమ నిరసనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, సిపిఐ పీలేరు నియోజవర్గ కార్యదర్శి టి.యల్. వెంకటేష్, బిసి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఎద్దుల మహేష్ యాదవ్, దళిత బహుజన విద్యార్థి విభాగం ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు బద్దె భానుప్రకాష్, ఎపిఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు వేలూరు గురునాథం, వైసిపి విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు మలతోటి నరేష్ కుమార్, ఎన్ఎస్‌యుఐ రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షులు చీకటి పల్లి సాయిసంపత్, మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున, ఎంఆర్‌పిఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ వేలూరు పురుషోత్తం, బాస్ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి మల్లికార్జున పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

కార్యకర్తలకు అండగా ఉంటాం : నిస్సార్

కదిరప్పను పరామర్శిస్తున్న నిస్సార్‌అహ్మద్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పార్టీ పటిష్టత కోసం కృషి చేసే కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని మదనపల్లి వైసిపిసమన్వయకర్త నిస్సార్ అహ్మద్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వెంగంవారిపల్లె గ్రామంలోని గొల్లపల్లెకు చెందిన వైసిపి నాయకులు కదిరప్ప ఇటీవల ప్రమాదానికి గురై గాయపడ్డారు. వైద్య చికిత్సల అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకంటున్నారు. విషయం తెలుసుకున్న నిస్సార్ స్థానిక వైసిపి నాయకులతో కలసి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైసిపి నాయకులకు, కార్యకర్తలకు పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. కదిరప్ప కుమార్తె వివాహ నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రెడ్డిశేఖర్ రెడ్డి, నవాజ్, కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, శశిధర్‌రెడ్డి, ఖాదర్‌భాషా, రెడ్డిభాస్కర, నాగరాజా, చంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి వైద్యశాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆదివారం స్థానిక హెచ్ఎంఎం ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికి అన్ని రకాల కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత కంటి అద్దాలు అందించారు. ఆపరేషన్ అవసరమైన రోగులకు సాయంకాలం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి తిరుపతి అరవింద కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు నిర్వహించేందుకు రూపానంద రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి, సాయి వికాస్ రెడ్డి వైద్య శిబిరానికి వచ్చిన రోగులను పరామర్శించి వారికి అవసరమైన కంటి పరీక్షలు చేయించారు. గత నాలుగు రోజులుగా కంటి వైద్య శిబిరం గురించి విశేష ప్రచారం చేయడంతో అధిక సంఖ్యలో రోగులు శిబిరానికి విచ్చేశారు. దాదాపు 200 మందికి పైగా కంటి ఆపరేషన్లు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు రూపానందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో క్లాస్ వన్ కాంట్రాక్టర్ పాటూరు శ్రీనివాసులురెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న రూపానంద రెడ్డి ఫౌండేషన్ బృందం

గ్రామీణాభివృద్ధికి యువతే మార్గదర్శి

మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

గ్రామీణ అభివృద్ధికి వెటర్నరీ యువతే మార్గదర్శి అని వెటర్నరీ రంగంలో అపార అవకాశాలు ఉంటాయని అర్చన విద్యాసంస్థల అధినేత డాక్టర్ పాపిరెడ్డి మదనమోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణం ఎగువ అబ్బవరంలోని అర్చన వెటర్నరీ పాలిటెక్నిక్ వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మదన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మూగ జీవులకు వైద్య సేవలు అందించే పుణ్యం వెటర్నరీ విద్యార్థులకే లభిస్తుందన్నారు. ఈ సేవలో మనసు ఉంటే, జీవితం ఎదుగుదలతో నిండిపోతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వెటర్నరీ కోర్సులకు ఉన్న డిమాండ్ విపరీతమైందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో వేలాది ఉద్యోగ అవకాశాలు వెటర్నరీ చదివిన వారికి అందుబాటులో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ, ప్రయివేట్ డెయిరీలు, పశుసంవర్ధక సంస్థలు, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు, ఫీడ్ కంపెనీల్లో భారీ స్థాయిలో అవకాశాలు ఉన్నాయని వివరించారు. వెటర్నరీ పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన యువత క్షేత్రస్థాయిలో రైతులతో పనిచేసే సామర్థ్యం పెంచుకుంటే, నెలకు రూ.20 వేల నుంచి రూ.1 లక్ష వరకూ సంపాదించగలరు. విదేశాల్లోనూ వెటర్నరీ నైపుణ్యాలకు భారీ డిమాండ్ ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణ ఆదాయానికి కీలకమైందని, ప్రతి ఇంట్లో పెంపుడు జంతువులు, ఆవులు, గేదెలు పెంపకం పెరుగుతున్న నేపథ్యంలో వెటర్నరీ రంగ ప్రాధాన్యత మరింతగా పెరిగిందని పేర్కొన్నారు. అర్చన విద్యాసంస్థలలో ఇంటర్ తో పాటు బిఎస్‌సి నర్సింగ్, బిపిటి, ఎంఎల్‌టి, ఫిజికల్ ఎడ్యుకేషన్ వంటి విలువైన కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని సూచించారు. కళాశాల డైరెక్టర్ పాపిరెడ్డి లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరుచు కోవాలని, మారుతున్న ప్రపంచ అవసరాలకు తగ్గట్లు తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. సీని యర్లు తమ జూనియర్లకు స్మరణీయమైన వీడ్కోలు ఇచ్చారు. ఘనంగా సాం స్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్య క్రమంలో డాక్టర్ మౌలాలి, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రమేష్, డాక్టర్ శివ ప్రకాష్, శివమణి, సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్య సాయిబాబా సేవా మార్గం ఆదర్శనీయం

-కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-రాయచోటి

భగవాన్ శ్రీ సత్య సాయి బాబా చూపిన సేవా మార్గం ప్రపంచానికి ఆదర్శనీయమని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం రాయచోటి కలెక్టరేట్లో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వ హించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సత్య సాయిబాబా చూపిన సేవా మార్గం సమాజంలోని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పేర్కొన్నారు ఉమ్మడి అనంతపురం జిల్లాకు నీటి సౌకర్యం అందడంలో సాయిబాబా చేసిన కృషి మరిచిపోలేనిదన్నారు. అందరినీ ప్రేమించాలి అందరికీ ఉదార భావంతో సేవాందించాలని ఆయన చెప్పిన నినాదాన్ని అందరూ పాటించాలని సూచించారు. పుట్టపర్తిలో జన్మించిన శ్రీ సత్యసాయిబాబా ధర్మం, అహింస, ప్రేమ మార్గాలను ప్రపంచానికి అందించారని పేర్కొన్నారు. ఆయన పుట్టపర్తి లో ఏర్పాటు చేసిన విద్యాసంస్థలు, ఆస్పత్రులు ప్రపంచానికి ఆదర్శమన్నారు. జాతి,మతం, దేశం అనే భేదాలు లేకుండా ప్రపంచాన్ని ఏకం చేసిన మహానుభావుడన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వివిధ ఎన్‌జిఒల ప్రతినిధులు శ్రీ సత్యసాయిబాబా జీవితంలోనికి ముఖ్య విషయాలను తెలియజేశారు. అనంతరం సాయిబాబా భక్తులు ఆయన భజనలను చేసి ఆయనను స్మరించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం, ఎన్‌జిఒల ప్రతినిధులు పాల్గొన్నారు. **కలకడ:** ఎంపిడిఒ కార్యాలయంలో సత్య సాయి బాబా శత జయంతి వేడుకలు ఎంపిడిఒ భానుప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. సత్య సాయి బాబా సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు మానవ విలువలను బోధించారున్నారు. గ్రామ నాయకులు రమణ, జావేద్, ఇనయతుల్లా, అందరూ పంచాయితీ కార్యద ర్శులు, బాబా కమిటీ మెంబర్స్, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒ రమేష్ బాబు, ఎపిఒ రమేష్, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బందితో కలిసి పుట్టపర్తి సాయిబాబా శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్యసాయి బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి శతజయంతి వేడుకల్లో కలెక్టర్, అధికారులు

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-ములకలచెరువు : నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త పనిచేయాలని తంబళ్లపల్లె జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పోతుల సాయినాథ్ అన్నారు. ఆదివారం ములకలచెరువు జనసేన పార్టీ కార్యాలయంలో నియోజ కవర్గంలోని జనసేన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా సాయినాథ్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో జనసేన ఊపందుకోవాలన్నారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ పోటీ చేసే చోట్ల గెలుపొందే విధంగా నాయకులు కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. రక్తదానం చేసిన జనసేన పార్టీ కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ఉరుసు

ప్రజాశక్తి - వేంపల్లె : బిడ్డాల మిట్టలోని పాపాగ్ని నది ఒడ్డున వెలిసిన హజ్రత్ జిందేషా మదార్ షావలి ఉరుసు ఆదివారం ఘనంగా ముగిసింది. రెండు రోజులపాటు జిందేషా మదార్ షావలి ఉరుసును దర్గా కమిటీ సభ్యులు నిర్వహించారు. శనివారం రాత్రి జరిగిన జిందేషా మదార్ షావలి ఉరుసు మహోత్సవంలో ఖవ్వాలీ పోటీలు తాబ్ రేజ్ ఖాదిరీ, తాహసీనా తాజ్ మధ్య రసవంతంగా, పోటాపోటీగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ నర్సింహులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, బాలకృష్ణారెడ్డి, దర్గా కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో వైసిపి నాయకులు

వైసిపి బలోపేతమే కర్తవ్యం కావాలి

-మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - వాల్మీకిపురం

రాష్ట్రంలో వైసిపి బలోపేతమే ప్రతి కార్యకర్త కర్తవ్యం కావాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురంలో జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి హాజరైన ఆయనకు స్థానిక నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలనలో పేద ప్రజలు సంతోషంగా ఉండేవారని, ప్రస్తుత కూటమి పాలనలో ఏ ఒక్క రంగానికి సంబంధించిన ప్రజలు సంతోషంగా లేరన్నారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించక తీవ్ర ఆందోళనకు లోనవుతున్నట్లు చెప్పారు. తుఫానులు, వరదలలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునే పరిస్థితి కూడా లేదన్నారు. విద్య, వైద్య రంగాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, గత ప్రభుత్వ హయాంలో నాడు - నేడు, వివిధ పథకాలతో విద్యా వైద్య రంగాల అభివృద్ధికి విశేష కృషి జరిగిందన్నారు. గ్రామీణ, పేద వర్గాల ప్రజలకు మెరుగైన ఉన్నత శ్రేణి వైద్య సేవలను అందించడం, వైద్య విద్యను అందుబాటులోకి తేవడానికి వైసిపి పాలనలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను మంజూరు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు కుట్రలు పన్నుతూ వైద్య విద్యను పేద వర్గాలకు దూరం చేస్తోందన్నారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకిరణ చర్యలను వైసిపి తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, ప్రజా, విద్యార్థి సంఘాలు వ్యతిరేకిస్తున్నా కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. ఏడాదిన్నర కాలంలోనే కూటమి ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారని, డైవర్షన్ పాలిటిక్స్ తో ప్రజల్ని ఏమారుస్తూ పాలకులు కాలాన్ని వెళ్లదీస్తున్నట్లు విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను వైసిపి కార్యకర్తలు క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలన్నారు. కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ వైసిపి బిసి విభాగం అధ్యక్షుడు నీళ్ల భాస్కర్, మండల అధ్యక్షుడు పులి శివకుమార్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, మాజీ సర్పంచ్ సురేష్ కుమార్ రెడ్డి, నాయకులు చలపతి, విశ్వనాథ్, సమీ, రాయుడు, సత్య, జబీవుల్లా పాల్గొన్నారు.

పెరటితోట విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-కలికిరి

మండలంలో వారం రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఎస్‌వి.వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చివరిరోజు గ్రామీణ మహిళలకు పెరటితోట విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ముగింపు కార్య్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు మాట్లాడుతూ సామాజిక సేవాభావం, నాయకత్వ లక్షణాలు, అభివృద్ధి చెందాయని, జాతీయ సేవా పథకంలో వారి అనుభవాన్ని గ్రామస్తులతో పంచుకొని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్‌ప్రదీప్, అసోసియేట్ డీన్ రిప్రజెంటేటివ్ డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో తమతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న కృషి విజ్ఞాన కేంద్ర సిబ్బందికి, గ్రామస్తులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

వారోత్సవాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కలికిరి

మండలంలో సోమవారం నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న రైతన్నా..మీకోసం వారోత్సవాలను విజయవంతం చేయాలని వ్యవసాయ అధికారి హేమలత కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతి రైతు సేవ కేంద్ర పరిధిలోని ప్రతి రైతు కుటుంబానికి యంత్రాల లభ్యత, రైతుల అభిప్రాయాలు, వారి అవసరాల గురించి రైతులతో చర్చించి ఎపి ఎఐఎంఎస్ అనే యాప్‌లో పొందుపరచడం జరుగు తుందన్నారు. వర్క్ షాప్ నిర్వహించి ఈ రబీ సీజన్‌లో, 2026 ఖరీఫ్, రబీ సీజన్‌లకు ప్రణాళికను సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కె ఇన్‌ఛార్జి టీం లీడర్‌గా సహాయ కులుగా సచివా లయ సిబ్బంది, విఆర్‌ఒలు, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొటారని తెలిపారు.

పొరుగువారి హక్కులను కాపాడుదాం

ప్రజాశక్తి-రాజంపేట

పొరుగు వారి హక్కులను కాపాడుదామని జమాత్ ఇస్లామీ హింద్ అధ్యక్షులు ఖాదర్ మొహిద్దీన్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జమాత్ హిందూ కార్యాలయంలో 'పొరుగువారి హక్కులను కాపాడుదాం' అనే పోస్టర్లను, బుక్‌లెట్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా పొరుగువారి హక్కులపై ప్రచారం నిర్వహిస్తున్నారని చెప్పారు. సామాజిక సామరస్యం, పరస్పర గౌరవం పెంపొందించడానికే ప్రచారం చేస్తున్నామని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా రాజంపేట పట్టణంలోని ఎస్ఆర్ కల్యాణమండపంలో ఈనెల 30 భారీ బహిరంగ సభ ఉంటుందని, ప్రజలందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. పొరుగువారి పట్ల మన బాధ్యతలను గుర్తు చేసుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మోహిద్దీన్

క్రైం కార్నర్

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నమ్మించి మోసం చేశాడని ఓ మహిళ వాస్మోల్ తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ప్రభుత్వాసుపత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ములకలచెరువు మండలం, పెద్దపాళ్యంకు చెందిన అమ్మజాన్ కొంతకాలం క్రితం కువైట్ వెళ్ళింది. అక్కడ కష్టపడి సంపాదించిన డబ్బు, బంగారం ను పెద్దపాళ్యం లో తనకు నమ్మకంగా ఉన్న ఓ వ్యక్తికి పంపింది. తీరా స్వగ్రామానికి వచ్చిన ఆమె తాను పంపిన డబ్బు, బంగారం ఇవ్వాలని కోరగా అతను ముఖం చాటేశాడు. నమ్మిన వ్యక్తే మోసం చేశాడని తెలుసుకుని జీవితం పై విరక్తి చెంది వాస్మోల్ తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన బంధువులు బాధితురాలిని 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ములకలచెరువు పోలీసులు విచారణ చేస్తున్నారు.

అనారోగ్యంతో మరో మహిళ..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ సంఘటన ఆదివారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సొసైటీ కాలనీకి చెందిన రాజేశ్వరి కొంతకాలంగా మైగ్రేన్ తలనొప్పితో తీవ్రంగా బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రులలో చూపించుకున్నా డబ్బు ఖర్చు తప్ప జబ్బు నయం కాలేదు. మరోసారి భరించలేని తలనొప్పి రావడంతో తట్టుకోలేక ఇంట్లో ఉన్న నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు బాదితురాలిని వెంటనే స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు చికిత్స అందిస్తున్నారు. ఒకటో పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.